క్లుప్తంగా

కార్యకర్తలను పరామర్శించిన పేర్ని నాని



మచిలీపట్నంటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఇరువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మంగళవారం పరామర్శించారు. సురక్ష ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరకటూరి సీతారాములు, ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దాల రాములను ఆయన పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు చిటికెన నాగేశ్వరరావు, చీలి చక్రపాణి ఉన్నారు.

18న సర్వసభ్య సమావేశం

పెడన: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కె.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన సూచించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా



కొడాలి(ఘంటసాల): ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు రావెప్ విద్యార్థులు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు గ్రామీణ పని అనుభవంలో భాగంగా ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో మంగళవారం హర్ ఘర్ ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన ఇంటిపై గర్వంగా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు, గ్రామ సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఏఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం మంగళవారం భక్తజనంతో నిండిపోయింది. ఒకరోజు వివిధ సేవా టిక్కెట్లు ద్వారా రూ. 8,79,695లు ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. వేదపండితులు స్వామివారికి నిత్య శాంతి కల్యాణం నిర్వహించారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందనడానికి పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలే నిదర్శనం అని ముస్లిం సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి సద్రుద్దీన్ ఖురేషి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, పోలీస్ శాఖ ఏకమై భయానక వాతావరణం సృష్టించి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని ఆరోపించారు. ఈ ఎన్నికల తీరును పూర్తిగా ఖండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

రెండు కంపాక్టర్ల ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛాంధ్ర మిషన్ నుంచి నగరపాలకసంస్థకు వచ్చిన రెండు పెద్ద కంపాక్టర్ల వాహనాలను మంగళవారం కమిషనర్ బాపిరాజు మున్సిపల్ కార్యాలయం వద్ద పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంపాక్టర్ల వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో రోజూ సేకరిస్తున్న చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించడం సులువు అవుతుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జి.గోపిచంద్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రసాయక ఎరువులతో పర్యావరణ కాలుష్యం

చల్లపల్లి: రసాయక ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల చీడపీడలు ఉధృతమవ్వడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పురిటిగడ్డ, నడకుదురు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని అధిక ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. తద్వారా జీవజాతులకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు.

దివ్యాంగులపై ప్రభుత్వ కత్తి

- పింఛన్ల కోత ప్రారంభం
- సదరం రీవెరిఫికేషన్ వివరాలు అప్లోడ్ చేయని వైనం
- నగరంలో దాదాపు 500 మంది దివ్యాంగులకు అందని పింఛన్లు



ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగురాలి పేరు పిండి నిర్మల. నగరంలోని రాడార్ కేంద్రం సమీపంలో నివాసం ఉంటుంది. జన్మించిన నాటి నుంచే మానసిక వికలాంగురాలైన నిర్మల గత 10 ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ పొందుతోంది. అయితే వైద్యుల నిర్వాకంతో ఈ నెల పింఛను సొమ్ము అందలేదు. పేద కుటుంబానికి చెందిన ఆమె కుటుంబ సభ్యులు ఈనెల పింఛన్ అందకపోయేసరికి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వ కక్ష సాధింపునకు ఈసారి దివ్యాంగుల వంతైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీ రహితంగా వివిధ రకాల సామాజిక పింఛన్లను అర్హతే ప్రామాణికంగా అందజేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పింఛన్ల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా సర్వజన ఆస్పత్రిలో వికలాంగుల సదరం ధృవీకరణ పత్రాల పునఃపరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ నిర్వాకంతో నగరంలో ఏళ్ల తరబడి పింఛన్లు పొందుతున్న దాదాపు 500 మందికి పైగా దివ్యాంగులకు ఈనెల సామాజిక పింఛన్లు అందలేదు.

ఆందోళనలో దివ్యాంగులు

జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఇటీవల కొద్ది నెలల క్రితం దివ్యాంగుల నిర్ధారణ కోసం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్ నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన వైద్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా సర్వజన ఆస్పత్రికి వచ్చి దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. దీంతో సదరం ధ్రువీకరణ పత్రం కోసం వారి వివరాలు ఆయా వైద్యులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంది. చాలా వరకు దివ్యాంగుల వివరాలను అప్లోడ్ చేసిన వైద్యులు కొంత మంది వివరాలు మాత్రం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయలేదు. దీంతో పింఛన్లు తొలగించేందుకే ఇలా చేశారనే అనుమానాన్ని దివ్యాంగులు వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని 50 డివిజన్‌లో పలువురు దివ్యాంగులకు పింఛన్ సొమ్ము అందలేదు. దీంతో వారు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలోనైనా రెండు నెలల పింఛన్లు అందించాలని వారు కోరుతున్నారు. సాధారణ పింఛన్‌దారులకు యధాతథంగా పింఛన్ సొమ్ము అందజేసి దివ్యాంగులమైన తమ పింఛన్లను నిలుపు చేసిన ప్రభుత్వ తీరును వారు తప్పుబడుతున్నారు. దివ్యాంగుల పింఛన్లను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం చేయించిన ఈ రీవెరిఫికేషన్‌తో తమ పింఛన్లను శాశ్వతంగా నిలుపుదల చేశారా అనే సందేహాలను నగరంలోని దివ్యాంగులు వ్యక్తం చేస్తున్నారు.



జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగంలో సదరం ధృవీకరణ పత్రం రీవెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు



సదరం ధృవీకరణ రీవెరిఫికేషన్‌కు జీజీహెచ్‌కు మెట్లెక్కి వస్తున్న దివ్యాంగుడు(ఫైల్)

మోసాల బాబుకు గుణపాఠం తప్పదు



'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉప్పాల రాము, పార్టీ నేతలు

గూడూరు: అపద్ధపు హామీలు, మోసాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు రానున్న కాలంలో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము పేర్కొన్నారు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలోని రైతు కమ్యూనిటీ హాలులో మంగళవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు.. వందకు పైగా వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదన్నారు. చదువుకునే ప్రతి పిల్లవాడికి రూ.15వేలు ఇస్తామన్న బాబు తల్లికి పంగనామం పెట్టారన్నారు. ఆరుగాలం శ్రమించే రైతుకు జగనన్న ప్రభుత్వం ప్రతి ఏటా రూ.13,500 రైతు భరోసా అందిస్తే అన్నదాత సుఖీభవ అంటూ రైతులను నట్టేటా ముంచారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పండించిన పంటలకు మద్దతు ధర కూడా కల్పించలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా రూ.2,300 పలికిన బీపీటీ ధాన్యం నేడు రూ.1,600లకు కూడా కొనడం లేదన్నారు. రూ.9,500 పలికిన మినుము నేడు రూ.6,500కు పడిపోయిందన్నారు.

స్థానిక సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

రైతన్నలు సాగునీటి కోసం పడరాని పాట్లు పడుతుంటే పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే తాము ఏదో సాధించేసినట్లు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని రాము పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా గతేడాది మండు వేసవిలో కూడా డెడ్ స్టోరేజీ నుంచి 14 రోజుల పాటు పెడన నియోజకవర్గంలోని కాల్వల్లో సమృద్ధిగా నీరు పారించామని గుర్తుచేశారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లో నేడు సమృద్ధిగా నీరు ఉన్నా చివరి భూములకు చుక్క నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. రైతాంగ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యేకు ఏ మాత్రం అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఏనాడైనా యూరియా కొరత వచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. జగనన్న ముందు చూపుతో పరిపాలన సాధించబట్టే ఏనాడూ రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉత్పన్నం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎరువుల కోసం రైతులు రోడ్డున పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

హామీల అమలు విస్మరించారు..

సంపద సృష్టిస్తానని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సంపద సృష్టించడం ఏమో గానీ.. తమ పార్టీ కేడర్ సంపద పెంచుకోవడానికి మాత్రం బాగా కృషి చేస్తున్నారని రాము ఆరోపించారు. కూటమి నేతలు ఇష్టారాజ్యంగా ప్రజల సంపద కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న కాలంలో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విస్మరించినా వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన ఉండి వాటిని అమలు చేయించే వరకు పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి బూరగడ్డ శ్రీకుమార్, నేతలు సంగా మధుసూధనరావు, వేముల సురేష్ రంగబాబు, గోరిపర్తి రవికుమార్, గరికపాటి రామానాయుడు, తిరుమాని శ్రీనివాసరావు, ముత్యాల నాగేశ్వరరావు, కొండవీటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు: చిన్నారులకు నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూధనరావు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎంపీపీ ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వి.రామకృష్ణ, ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ మౌనిక పాల్గొన్నారు.

874మందికి ఆల్బెండజోల్ మాత్రలు

ఎదురుమొండి(నాగాయలంక): ఎదురుమొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 19 అంగన్‌వాడీ కేంద్రాలు, 23 ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం 874 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.రాజేశ్వరరావు, డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బండ్రెడ్డి రాజేంద్ర కుమార్, హెల్త్ అసిస్టెంట్ కె.జగన్మోహన్ రావు, పాఠశాల హెచ్ఎం బి.లలితకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెడన: మండల వ్యాప్తంగా మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో చిన్నారులకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్ల పర్యవేక్షణలో టాబ్లెట్‌లను అందించి మింగించారు. ఆయా వైద్యశాలలకు చెందిన వైద్యులు డాక్టర్ హిమపద్మజ, డాక్టర్ పర్వేజ్ హైదర్, డాక్టర్ మీనాదేవి, డాక్టర్ ప్రదీప్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

కృత్తివెన్ను: జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా మంగళవారం మండలంలోని కృత్తివెన్ను, చినపాండ్రాక, లక్ష్మీపురం పీహెచ్‌సీల పరిధిలోని 1 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారికి వైద్యుల పర్యవేక్షణలో మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు సాయిసందీప్, సూర్యతేజ, హీరా, మిథున, సంతోష్ కుమార్, సోనియా నారాయణన్, సీహెచ్‌వోలు గంగాధర్, ప్రభావతి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పీహెచ్‌సీ పరిధిలో..

ఘంటసాల: స్థానిక జెడ్పీ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీపీ వేమూరి రజనీ కుమారి పంపిణీ చేశారు. అలాగే ఘంటసాల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రలు ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీహెచ్ఎస్ పూర్ణచంద్రరావు, ఎంపీహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఎంలు శ్రీరంగవల్లి, కృష్ణకుమారి, సునీత, నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అనూష, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చేవేంద్ర జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



మచిలీపట్నంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

మచిలీపట్నంటౌన్‌లో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. నగరంలోని 32వ డివిజన్‌లోని దేశాయిపేట సున్నపుబట్టీల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అంగన్‌వాడీ కార్యకర్త శీలం ప్రసన్నలక్ష్మి, ఏఎన్ఎం లీల, ఆశ వర్కర్ భానుశ్రీలు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క పిల్లలు పరిశుభ్రంగా ఉండాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

బంటుమిల్లి: మండలంలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మంగళవారం ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కె. పవన్‌కుమార్, కె. సువర్చల పర్యవేక్షణలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలసి విద్యార్థులకు మాత్రలు వేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతన్నల పాట్లు



పెదప్రోలులో యూరియా కోసం క్యూలో రైతులు

పెదప్రోలు(మోపిదేవి): యూరియా ఎరువును సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పెదప్రోలు పీఏసీఎస్ సొసైటీకి మంగళవారం 445 యూరియా కట్టలు రావడంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. ఇప్పటి వరకు మండలంలో ఖరీఫ్ సాగు కింద 4,331 హెక్టార్లలో వరి నాట్లు వేయగా కేవలం 576.7 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన మోతాదులో యూరియా అందించి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

బారులు తీరిన రైతులు

గూడూరు: ఖరీఫ్‌లో వరిసాగు చేపట్టిన రైతులకు అదను దాటిపోతుండటంతో యూరియా కోసం అష్టకష్టాలు తప్పడం లేదు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం వద్ద మంగళవారం ఉదయం నుంచి అమ్మకాలు ప్రారంభించారు. సొసైటీకి యూరియా లోడు వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు సొసైటీ ఎదుట బారులు తీరారు. మండుటెండలో గంటల తరబడి నిలబడి యూరియా బస్తా కోసం ఆపసోపాలు పడ్డారు. మహిళా రైతులు సైతం లైన్లో నిలబడి యూరియా కోసం పడరాని పాట్లు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

మోపిదేవి: కొక్కిలిగడ్డ రోడ్డు సమీపంలో 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురి తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. అవనిగడ్డకు చెందిన ఇద్దరు యువకులు శ్రీను, మాధవరావు మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై చల్లపల్లి వైపు వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపోయారు. దీంతో ఇరువురికి గాయాలు అవడంతో అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యుల సూచనల మేరకు శ్రీనును మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతులకు వెంటనే యూరియా అందించాలి

ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మకు సమస్యను వివరిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా వెంటనే యూరియాను సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో యూరియా అందకపోవడంతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా కోసం బారులు తీరి నిలబడినప్పటికీ అరకొరగా అందజేస్తున్నారని చెప్పారు. దీంతో ప్రైవేటు షాపుల నుంచి అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతాంగానికి సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

చల్లపల్లి: రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పేర్కొన్నారు. మండల పరిధిలోని వక్కలగడ్డలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సరిపడా యూరియాని ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూరియా సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది బోసు పాల్గొన్నారు.


వరిసాగులో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

ఘంటసాల: ఆలస్యంగా నాట్లు వేసే వరిలో కాండం తొలుచు పురుగు నివారణ యాజమాన్య పద్ధతులు చేపట్టాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం వరిలో నైపుణ్యత ప్రదర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఘంటసాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వరిలో ఆకుల అంచుల నుంచి పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి ఆకుల అంచుల నుంచి ఎండిపోతున్నాయని చెప్పారు. వీటి నివారణకు పొటాష్ ఎరువులను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఎకరానికి 20–25 కిలోలు చొప్పున రైతులు తప్పకుండా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు వాపస్ చేసిన అంగన్‌వాడీలు

బంటుమిల్లి: బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లు ప్రభుత్వ సమాచారం నమోదు చేయడంలో సపోర్టు చేయడం లేదంటూ వాటిని కార్యాలయంలో అప్పగించారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తలు సెల్‌ఫోన్లు కార్యాలయంలో అప్పగించేందుకు రాగా అక్కడ అధికారులు ఎవరు లేకపోవడంతో ఎవరికి వారు తమ పరిధిలోని సెక్టారు లీడర్లకు వాటిని అప్పగించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



బంటుమిల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

బంటుమిల్లి: సరైన ఆదాయం లేక అప్పుల పాలవుతున్న తమను ఆదుకోవాలని, ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో మండల కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు పథకం నిర్ణయంతో ఆటో కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆటో నిర్వాహకులకు రూ. 25వేలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వాహన మిత్ర పథకంలో రూ. 10వేలు ఇచ్చి ఆదుకుందని గుర్తుచేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు ఇమానీయేలు, సభ్యులు జబీర్, నాగరాజు, శివ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారికి సామూహిక మంగళగౌరీ వ్రతం, కుంకుమార్చన నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన జరిపారు.